# ఇదీ ప్రగతి!

## లవలి

సొంత రాష్ట్రానికి ప్రయాణమైన రాఘవరావు తనకి తానే కొత్తగా కనిపిస్తున్నాడు.

ఇప్పుడు తను మాటాడే మాటలే కాదు – తనలోని అన్నిరకాల కదలికలూ కొత్తదనంతో మురిసిపోతున్నాయి.

రైలు ఎక్కినది మొదలు అతని హృదయం పౌర్ణమి నాటి మహార్ణవంలా పొంగిపోతోంది.

ఈ ప్రయాణం కోసం నాలుగు సంవత్సరాల నుండీ ప్రయత్నం చేస్తున్నాడు. ఏదీ! కుదరలేదు. సెలవు దొరకలేదు. తన వుద్యోగం అలాంటిది.

ఇన్నాళ్ళకి సెలవు దొరకడం – వెంటనే బయలుదేరడం – ఇదంతా నిజమేనా? అనిపిస్తోంది తనకి. ఏదో ఇదీ అని చెప్పలేని ఆనందం తనని వుక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

తాను పుట్టిన వూరికి తను వెడుతున్నాననీ కాదు. వృద్ధులైన తన తలిదండ్రుల కౌగిళ్ళలో తను అద్వైతానందాన్ని పొందుతాననీ కాదు. ఏకాంతంలో ముగ్ధమోహనంగా తన మీద వాలిపోయి ముద్దులతో ముంచెత్తే తన భార్య సన్నిధిలో తను మైమరచి పోతాననీ కాదు.

మరి ఇంక ఎందుకింత ఆనందం రాఘవరావుకి?

తాను ఇంత వాడవటానికి పునాది వేసిన ఆ పాఠశాల ఆవరణలో అడుగు పెట్టి, ఒక్కసారిగా గతంలోకి వెళ్ళిపోయి తను మళ్ళీ ఆ నాటి విద్యార్థిగా మారిపోతాననీ కాదు.

ఆ పాఠశాల పక్కనే వున్న గురువు గారి మఠంలో అడుగు పెట్టాలనీ – అక్కడి గాలి గుండెల నిండా పీల్చుకోవాలనీ – గురువు గారి కాశీ కాపడిని కనుల పండుగగా దర్శించుకోవాలనీ – గురువు గారి పాదాల మీద వాలిపోయి తన తను వెల్లువులక లెత్తాలనీ – ఆయన తనని అక్కున చేర్చుకొని ఆనంద బాష్పాలు రాలుస్తూ వుంటే తనలోని అణువణువూ పరవశించి పోవాలనీ!

ఇదీ రాఘవరావు కోరిక. ఇది నెరవేరబోతోందని ఇంత ఆనందం అతనికి.

రాఘవరావుకి ఇప్పుడు తను ప్రయాణం చేస్తూ వున్న రైలు కూత గానీ, ఆ చక్రాల కరకర ధ్వనులు గానీ, తాను కూర్చున్న పెట్టెలోని ప్రయాణీకుల కోలాహలం గానీ – ఏవీ వినబడటం లేదు.

అతని మనస్సు గురువు గారి చుట్టూ తిరుగుతూ తన విద్యార్థి జీవితపు పుస్తకాన్ని తెరుస్తోంది.

ఆ యేడు తను వున్న వూళ్ళోనే అయిదో తరగతి పూర్తి చేసాడు. హైస్కూలు చదువులకి పోవాలంటే అప్పట్లో తన వూరికి ఇరవై మైళ్ళ దూరంలో వున్న కొత్తపేట పోవాలి. అక్కడ హొటలు భోజనాలు, గది అద్దెలూ, పుస్తకాలూ, స్కూలు ఫీజులూ- ఇంతా అంతా ఖర్చు కాదు.

అంత ఖర్చుతో కూడుకున్న చదువు – ఆయవారపు బ్రాహ్మడి కడుపున పుట్టిన తను కలలో కూడా వూహించలేదు. అయినా పై చదువులు చదవాలన్నిఆరాటం.

తోటి వాళ్ళంతా హైస్కూల్లో చేరటానిక వురుకులు పరుగులు పెడుతున్నారు.

కొంత మంది గవర్నమెంటు హాస్టళ్ళలో చేరుతున్నారు. అక్కడ వుచితంగా భోజనం పెట్టి పుస్తకాలు బట్టలు ఇస్తారని తెలిసింది. వాళ్ళు స్కూలు ఫీజులు కూడా కట్టనక్కరలేదట.

తను కూడా ఆ హాస్టలు సీటు కోసం ప్రయత్నం చేసాడు. కానీ దానికి తన కులం అడ్డు వచ్చింది. అప్పుడు తన దురదృష్టాన్ని తలుచుకుంటే తనకి ఏడు పొచ్చేసింది. ఆ సమయంలో ఎవరో చెప్పారు గురువు గారి మఠం గురించి.

వెంటనే ఆ వివరాలు పూర్తిగా తెలుసుకుని బస్సుకు డబ్బులు లేకపోతే ఆ ఇరవై మైళ్ళూ నడిచి వచ్చి తొలిసారిగా గురువుగారి మఠంలో అడుగు పెట్టాడుతను.

అక్కడ ఇంకో లోకంలోకి వెళ్ళినట్టు తోచింది తనకి. పూల తీగలు దట్టంగా అల్లుకున్న పందిరి కింద కాశీ కాపడికి అలంకారాలు దిద్దుతున్న ఆయన తన అలికిడి విని పైకి చూసారు.

తెల్లగా మిలమిలా మెరిసిపోతూ వున్న పొడవాటి గడ్డం! చిరునవ్వులతో వెలిగిపోతూ వున్న ముఖం! సాదరంగా పలకరిస్తూ వున్న పెద్ద పెద్ద కళ్ళు!

చూడగానే ఆయనే గురువు గారని తెలిసిపోయింది.

రెండు చేతులూ జోడించి భక్తితో నమస్కరించాడు తను.

ఆ కన్నులు తనని దగ్గరకి రమ్మని పిలిచాయి. ఏం కావాలని అడిగాయి.

తెరలు తెరలుగా వస్తూ వున్న తన దుఃఖాన్ని ఆపుకుంటూ తన కథంతా చెప్పుకున్నాడు.

ఆ గురువుగారు తన చేతితో తన తల నిమిరి దగ్గరకు తీసుకొని ఆదరించారు.

అలా తను ఆ మఠంలో చేరి హైస్కూలు చదువు కొనసాగించాడు.

అక్కడ తన లాంటి వాళ్ళు ఇంకా పదిహేను మంది వున్నారు. అందులో అన్ని తరగతులూ చదివే వాళ్ళూ వున్నారు.

వాళ్ళక కులం లేదు. మతం లేదు. అందరూ ఒకటే.

అక్కడ ఎవరిక తాము పరాయి చోట వుంటున్నాము అనే ఆలోచన ఎప్పుడూ వచ్చేది కాదు.

కష్టపడి చదవాలనే పట్టుదల ఒకరిని మించిన వాళ్ళు ఒకరు ఎంత చిన్న విషయంలోనైనా పొరపాటు జరగనిచ్చే వాళ్ళు కాదు. అక్కడ వాళ్ళు జీర్ణం చేసుకున్న క్రమశిక్షణ అటువంటిది.

విద్యార్థుల సేవ తప్ప గురువుగారికి మరో ధ్యాస వుండేది కాదు సూర్యుడేనా ఆలస్యంగా బయలుదేరతాడేమో కాని గురువుగారు మాత్రం ఏ పనిలోనూ అరక్షణమేనా ఆలస్యం చేసే వారు కారు.

కోడి కూతతో లేచి మఠం పరిసరాలు స్వయంగా వూడ్చి అద్దంలా, తయారు చేసే వారు.

కాశీ కాపడి నిగనిగా మెరిసిపోయేలా తోమి తర్వాత స్నానం చేసే వారు.

తను చేసే పనిలోనికి ఎవర్నీ సాయం రానిచ్చేవారు కాదు. ఒక వేళ ఎవరేనా చేయాలని వెడితే,

"మీరు చేయాల్సిన పని చదువుకోవడం. అదే మీరు నాకు చేసే సాయం. అదే నాకు తృప్తి. వెళ్ళండి. మీ పని మీరు చూసుకోండి!" అని ఎంతో మార్దవంగా పలికేవారు.

స్నానం చేసిన తర్వాత కడవల నిండా నీళ్ళు నింపే వారు పాతాళంలో వున్న నీళ్ళు చేది, ఆ కడవలు ఒకటీ రెండూ కాదు ఇరవై దాకా వుండేవి పెద్ద

సైజులో.

నీళ్ళు తోడు కార్యక్రమం అయిన తర్వాత అప్పుడు కట్టుకునే వారు పొడి గుడ్డలు.

మొలకి కాషాయి రంగు అంగవస్త్రం. బుజం మీద అదే రంగుది మూరెడు గుడ్డ, ఇదీ ఆయన వేషధారణ.

ఈ వేష ధారణలో ఆరడుగుల విగ్రహం! పొడవుకు తగ్గ లావు పసుప్పచ్చగా దబ్బ పండులాంటి శరీరం! అపురూపంగా వుండేది. చూచే కొలదీ చూడాలనిపించేది.

ఆయన ఆ పరిసరాలలో తిరుగాడుతూ వుంటే అక్కడి వస్తువులన్నీ ఆయన రూపం అచ్చు పోసుకుంటున్నాయా అనిపించేది.

అప్పటికి ఉదయం 11-30 గంటలయి గణ గణా మోగేది హైస్కూలు ఇంటర్వెల్ గంట.

వెంటనే బిల బిలలాడుతూ భాల బాలికలందరూ బారులు తీరి మంచి నీళ్ళ కోసం ఎగబడే వారు.

అప్పుడు చూడాలి గురువుగారిని.

అందర్నీ పేరు పేరునా పలకరిస్తూ- చక చకా గ్లాసుల్లో మంచినీళ్ళు పోసే వారు. ఆ మంచి నీళ్ళతో బాటు చిరు నవ్వులూ ఆప్యాయతా; వాత్సల్యం కలబోసి మరీ పోసే వారు.

అప్పుడాయన పనిలోని వేగం చూస్తే ఆయన ఇరవై చేతులతో పని చేస్తున్నట్లు తోచేది.

అటువంటి సన్నివేశంలో- అక్కడ మంచినీళ్ళు త్రాగడం విద్యార్థులకు మరపురాని మధురానుభూతి.

ఆ స్వల్ప వ్యవధిలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు అక్కడ తమ దప్పిక తీర్చుకునేవారు.

లోపలి గంట కొట్టి జనం పలచబడగానే గురువుగారు అక్కడి నుండి లేచి కాశీ కావడి భుజాన వేసుకుని వూళ్ళోకి బయిలుదేరేవారు.

మధ్యాహ్నం ఒంటి గంటకు బడి విడిచిపెట్టే వేళకు బరువెక్కిన కాశీ కావడి మోసుకుంటూ తిరిగి వచ్చేవారు.


"మాతా! అన్నపూర్ణేశ్వరీ!" అనే నినాదంతో వుద్యమించి ఇంటింటికీ తిరిగి ఆయన సేకరించుకొని వచ్చిన భిక్ష- అన్నం కూరలూ పచ్చళ్ళూ, పులుసూ అన్నీ కలగలిసిపోయినది తన అమృత హస్తంతో ముందు విద్యార్థులకు పెట్టి తర్వాత తాను తినే వారు.

ఆ భోజనం ఆ మఠంలోని విద్యార్థులకు అమృత తుల్యం.

ఒక్కొక్క పూట భిక్ష అందరికీ సరిపోయేది కాదు. అలాంటి పూట వున్నది అందరికీ పంచి గురువుగారు వుపవాసమే వుండే వారు.

అలాంటి సమయాలలో విద్యార్థులు తాము కూడా వుపవాసం వుంటామనే వారు.

"చిట్టి తండ్రులూ! మీరు తినకపోతే నేను ఆకలి చిచ్చు భరించలేనురా! మీరు ఇంత తిన్నా నా కడుపు



# ఇదీ ప్రగతి

నిండిపోతుంది. చెప్పండి నన్నాకలితో బాధ పడమంటారా!''

అంతే! కిమ్మనకుండా విద్యార్థులు భోజనాలు చేసే వారు.

గురువుగారిది ఒక తపస్సు. ఆ తపస్సాధన కోసం ఆయన ఎంతో శ్రమించే వారు. ఏ రుతువూ తన ప్రభావాన్ని ఆయన మీద చూపించలేదు. అంత శ్రమ చేస్తున్నా అలసట అన్నది అయనలో ఏనాడూ కనబడేది కాదు. ఇదంతా విద్యార్థుల కోసం చేసే వారు. అందులో బ్రహ్మానందాన్ని అనుభవించేవారు.

ఏటా ఎంతో మంది విద్యార్థులు తమ తమ పరీక్షలలో విజేతలై గురువుగారి దగ్గర వీడ్కోలు పొంది వెళ్ళిపోయే వారు.

అలా జీవితంలో పైకి వచ్చిన విద్యార్థులెందరెందరో! వారందరూ గురువుగారి అనుమతి పొంది ఆ మఠంలో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలూ, బట్టలూ, స్కూలు ఫీజులూ పంపుతూ వుండే వారు. అలాంటి విద్యార్థుల ఆర్థిక స్థితికి తను తృప్తి పడిన తర్వాతనే వారికి అనుమతి యిచ్చే వారు.

తను కూడా అలాంటి సాయం చేయాలని దానికి గురువుగారి అనుమతి పొందాలనీ తహ తహలాడుతున్నాడు రాఘవరావు.

ఎప్పుడు రైలు దిగాడో ఎప్పుడు బస్సు ఎక్కాడో తెలియదు తనకి.

బస్సు కొత్తపేట చేరింది అనగానే ఒక్క దూకులో బస్సు దిగి సూటుకేసు రిక్షాలో పడేసి హైస్కూలు అని చెపుతూ ఎగిరి కూర్చున్నాడు.

''ఎవరీ పిచ్చివాడు!'' అని అక్కడి వాళ్ళు వింతగా చూస్తున్నారు రాఘవరావుని. రిక్షా ముందుకు సాగింది.

సంధ్య వెలుగుల్ని కూడా దిగమింగి ఇంక మాదే రాజ్యం అంటూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

అక్కడక్కడ విద్యుద్దీపాలు లో వోల్టేజిలో కొట్టుకుంటూ ఎకట్లతో పోరాడుతున్నాయి.

రిక్షా వచ్చి హైస్కూలు దగ్గర ఆగింది.

ఆగడమే తడవుగా రాఘవరావు రిక్షా దిగి మఠం సందులోకి పరుగెత్తాడు.

రిక్షా అతను సూట్‌కేసు పట్టుకొని అతని వెంట పడ్డాడు పైసలు తీసుకుందుకు.

లోపలికి వెళ్ళిన రాఘవరావు తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నాడు.

అది గురువుగారి మఠం కాదు!

తాను కొత్త చోటికి వచ్చాడా?

ఆ పరిసరాలు తనకి ఎంతో పరిచయమున్నవే! వాటితో తనకు ఆరుసంవత్సరాల అనుబంధమున్నదే!

మరి ఎలా పొరబడగలడు తను?

అక్కడ గురువుగారి కుటీరం లేదు!

ఆయన కూర్చునే రాతి తిన్నె లేదు!

తాము చదువుకున్న గదులు లేవు!

తనలాంటి వాళ్ళకెందరికో భిక్ష పెట్టిన కాశీ కావడి లేదు!

ఆ గాలి లేదు!

ఆ వాసన లేదు!

ఎవరిని చూడాలని ఇన్నాళ్ళూ తన కళ్ళు కాయలు కాసిపోయాయో ఆ గురువుగారు లేరు!

ఏవిటిది?

రాఘవరావుకంతా అగమ్య గోచరంగా వుంది.

''వాట్ కెనైడూ ఫర్‌యూ సర్!'' చేతిలో ట్రే అలంకరించుకొని వచ్చిన బేరరు వినయంగా అడుగుతున్నాడు.

అప్పుడు చూశాడు రాఘవరావు ఆ భవనాన్నీ, రంగు దీపాల మధ్య వెలిగిపోతూ వున్న అక్షరాల్నీ ''ప్రగతీ బార్ కమ్ రెష్టారెంట్'' అప్పుడు విన్నాడు డిమ్ లైట్ల కాంతుల్లో నుంచి దూసుకు వస్తూ వున్న డిస్కో అరుపులు- సీసాలూ గ్లాసులూ చేసే తీతువు కూతలూ.

మహోన్నత శిఖరాగ్రం నుండి తననెవరో అగాధమైన లోయలోకి నెట్టి వేసినట్టు అయింది రాఘవరావుకి.

''ముని వాటికను రాక్షసులు ఆక్రమించుకున్నారు'' అతని మనసు ఘోష పెడుతోంది.

అతని కళ్ళు నిస్తేజాలైపోయి తూలి కింద పడబోయాడు. అక్కడ నేల మీద నున్నని పాలీష్ రాళ్ళు. గురువు గారి పాద ముద్రలతో పవిత్రమైన మట్టి కూడా కనబడకుండా అవి కప్పి వేశాయి.

అక్కడ తన వంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్న భావనకు తట్టుకోలేక వెనుతిరిగాడు రాఘవరావు.

రిక్షా అతను తన కోసం ఎదురు చూస్తున్నాడు. తూలి పడబోతూ వున్న తనని పట్టుకొని రిక్షాలో కూర్చోపెట్టుకుని.

''ఎక్కడికి? మంచి లాడిజీకి తీసుకు పొమ్మంటారా?'' అని అడుగుతున్నాడు.

అతని మాటలు పట్టించుకోకుండా అతికష్టం మీద తన్ను తాను నిగ్రహించుకొని హీనస్వరంతో అడిగాడు రిక్షా అతనిని గురువు గారి గురించి.

''ఆయన కోసం వచ్చే రాండి తమరు! ఆ మహానుభావుడు ఎప్పుడో ఎల్లిపోయేడుండి!''

''ఎక్కడికి వెళ్ళారో తెలుసా నీకు?''

ఆశతో అడిగాడు రాఘవరావు.

''తెలవదండి బాబూ! ఈ బారు షాపాయనే గురువు గోర్ని అత్య సేయించి శవాన్ని కూడా మాయం చేసేశాడని అంతా అనుకుంటారు బాబూ!''

ఎవరేనా వింటారేమోనని అటు యిటూ చూస్తూ భయం భయంగా చెవిలో చెప్పినట్టు చెప్పేసి – రిక్షా గంట మోగిస్తూ – పెడలు మీద కాలు వేసి

''ఎక్కడి కెల్లాలి సెప్పండి?'' అంటూ పశ్నిస్తున్నాడు రిక్షా అతను. □

